క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం

నందిగామ: మండలంలోని కొణతమాత్మకూరు గ్రామానికి చెందిన కౌలు రైతు గండేపల్లి బ్రహ్మయ్య ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సంగతి పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం కిసాన్ శ్రామిక్ సన్స్థాంగ్ ప్రతినిధులు పట్టణంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మృతుడి భార్య భద్రమ్మకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గురునాథం, మేఘన, ఫణి, రాజా, ప్రసాద్ పాల్గొన్నారు.

దోమల నివారణకు ఎబేట్ ద్రావణం పిచికారీ చేయాలి

కంచికచర్ల: ఇటీవల గ్రామాల్లో కురిసిన వర్షాలకు కాల్వల్లో, ఖాళీ ప్రదేశాల్లో నిల్వ ఉన్న మురుగునీటిలో దోమలు ఆవాస కేంద్రాలుగా ఏర్పాటు చేసుకున్నాయని, వాటి నివారణకు ఎబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయించాలని ఎంపీటీసీ సభ్యుడు బర్రె ఉదయ్‌కిరణ్ అన్నారు. ఇటీవల కుండపోతగా కురిసిన వర్షాల కారణంగా గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందాయని, దీనివల్ల కంచికచర్ల పట్టణంలో దోమకాటు వల్ల విష జ్వరాలు వస్తున్నాయన్నారు. పంచాయతీ పాలకులు, అధికారులు ఇప్పటికైనా పట్టణంలో బ్లీచింగ్ చల్లి, దోమల నివారణకు ఎబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయించాలని కోరారు.

అవకతవకలు లేని ఓటరు జాబితా తయారు

తహసీల్దార్ శంకరబాబు



గండేపల్లిలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న బీఎల్ఓ రత్నాకర్

కంచికచర్ల: గ్రామాల్లో ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతోందని ఈ కార్యక్రమానికి గ్రామాల్లోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దార్ పబ్బూరి శంకరబాబు విజ్ఞప్తిచేశారు. మండల కేంద్రమైన కంచికచర్లతో పాటు మండలంలోని వేములపల్లి, ఎస్.అమరవరం, గండేపల్లి, కీసర గ్రామాల్లో సోమవారం ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని బీఎల్‌ఓలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపడుతున్నామని చెప్పారు. ముఖ్యంగా యువతను గుర్తించి వారికి ఓటు హక్కు కలిగేలా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందరి సహకారంతో నాణ్యమైన మెరుగైన ఓటరు లిస్టును తయారు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్పందన ద్వారా 11 అర్జీలు



స్వీకరించిన అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో రవీంద్రరావు

నందిగామ: స్పందన ద్వారా వచ్చిన ప్రతి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీవో రవీంద్రరావు తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందిన మొత్తం 11 అర్జీలు అందాయని ఆర్డీఓ తెలిపారు. వాటిలో రెవెన్యూ సమస్యలకు సంబంధించి 9, మున్సిపల్ సమస్యకు సంబంధించి 1, విద్యాశాఖకు సంబంధించి 1 చొప్పున అర్జీలు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల నుంచి వస్తున్న అర్జీలను పరిశీలించి వాటిని వెంటనే సంబంధిత శాఖకు బదిలీ చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా స్పందనలో స్వీకరించిన ప్రతి అర్జీని పరిశీలించి విచారణ చేయడంతోపాటు సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సచివాలయ కన్వీనర్లే వైఎస్సార్ సీపీ బలగం

ప్రభుత్వ విప్ ఉదయభాను



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, వేదికపై రాష్ట్ర జేసీఎస్ కోఆర్డినేటర్ కందుల రవీంద్రరెడ్డి, తన్నీరు నాగేశ్వరరావు, రంగాపురం రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులే అతి పెద్ద బలగమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక బి.కన్వెన్షన్‌లో జగ్గయ్యపేట నియోజకవర్గ సచివాలయ కన్వీనర్లతో సోమవారం సాయంత్రం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఉదయభాను, రాష్ట్ర జేసీఎస్ కోఆర్డినేటర్ కందుల రవీంద్రరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని సచివాలయాల కన్వీనర్లకు దిశా నిర్దేశం చేశారు. ఉదయభాను మాట్లాడుతూ దేశంలో ఏ పార్టీ తమ కార్యకర్తకు ఇవ్వని విధంగా వైఎస్సార్ సీపీ గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల బీమాతో పాటు వైద్యం నిమిత్తం కొంత సహాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో సచివాలయ కన్వీనర్లనే తన సైనికులుగా గుర్తించి ప్రజా సంగ్రామంలోకి వస్తున్నారని తెలిపారు. 2024లో టీడీపీ గెలిచే పరిస్థితి లేదన్నారు. టీడీపీ గతంలో ప్రజలకు ఏమి చేసిందో చెప్పుకోలేని దుస్థితిలో ఉందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు గ్రామాల్లో, వార్డుల్లో పార్టీ బలోపేతానికి మరింతగా కృషిచేయాలని కోరారు.

గృహసారథులపై గురుతర బాధ్యత

రాష్ట్ర జేసీఎస్ కోఆర్డినేటర్ కందుల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు గురుతర బాధ్యత వహించి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సచివాలయాల కన్వీనర్లు తుమ్మేపల్లి నరేంద్ర, కన్నమాల శామ్యూల్, లేళ్ల నాగేందర్‌రెడ్డి, దేవినేని నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఊట్ల నాగేశ్వరరావు, శ్రీనివాసగౌడ్, గాదెల రామారావు, పలు కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, వివిధ విభాగాల జిల్లా అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీల అధ్యక్షులు, దేవస్థానాల డైరెక్టర్లు, మండల సమైఖ్య అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట



బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రభుత్వవిప్ ఉదయభాను

వత్సవాయి: పేద, మధ్య తరగతి ప్రజల వైద్యానికి ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. మండల కేంద్రం వత్సవాయిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం రూ.50 లక్షలతో నూతనంగా నిర్మాణం చేస్తున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్య, వైద్యానికి అత్యధిక నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. పేదవాడికి కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే లక్ష్యంతో గ్రామాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా అత్యాధునిక సౌకర్యాలను కల్పిస్తున్నారని తెలిపారు. ప్రజలకు వైద్యం మరింత చేరువ చేసేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సీతమ్మ, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేళపోగు దేవమణి, వైస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాదెల రామారావు, సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య, సర్పంచులు వడ్డే పరమయ్య, కొట్టె నగేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు గుత్తా శంకరరావు, రమాకాంత్, చావా కృష్ణారావు, సామినేని లక్ష్మీనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ పండగ శ్రీను, భూక్యా రాజానాయక్ వైద్యాధికారులు సుష్మా ప్రియదర్శిని, సుస్మిత పాల్గొన్నారు.

జగనన్నకు తోడుగా నిలుద్దాం

గడపగడపలో విప్ ఉదయభాను



అద్దాల బజార్‌లో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న విప్ ఉదయభాను

జగ్గయ్యపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని 10వ సచివాలయం పరిధిలోని 20, 22 వార్డుల్లోని అద్దాల బజారు, బ్రాహ్మణ బజార్‌లలో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధిదారులు జగనన్నపై పూర్తి విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. దేశంలోనే గొప్ప సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యదర్శి జుబేర్, సచివాలయ కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్ బాబు, చైతన్య శర్మ, నాయకులు పూర్ణచంద్రరావు, శ్రీనివాస్, బ్రహ్మం, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారం

రూ.12 లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులు



కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తున్నట్లు శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని అడవిరావులపాడు గ్రామంలో చేపట్టిన కల్వర్టు నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధుల్లో భాగంగానే మునగచర్ల గ్రామంలో రూ.8 లక్షలతో సిమెంట్ రోడ్లు, రూ.12 లక్షలతో కల్వర్టులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో మాదిరిగా గ్రామీణ ప్రాంతాలను చిన్న చూపు చూడకుండా పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో పాటు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు గుర్తు చేశారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజా ప్రతినిధులు, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆకుల రంగ, సర్పంచ్ సూరా వెంకట నర్సమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మంచాల చంద్రశేఖర్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పలువురు నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త విడివిడిగా అందజేయాలి

మున్సిపల్ కమిషనర్ జయరాం



చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

నందిగామ: ప్రతి ఒక్కరూ తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరువేరుగా మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం పట్టణ వాసులకు సూచించారు. పట్టణ పరిధిలో నూతనంగా ఎలక్ట్రిక్ వాహనాల ద్వారా చెత్త సేకరణ కార్యక్రమం జరుగుతోంది. నాలుగవ వార్డు పరిధిలో సోమవారం ఎలక్ట్రిక్ వాహనాల ద్వారా జరుగుతున్న చెత్త సేకరణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ప్రాంతాలలో ఎలక్ట్రికల్ వాహనాల ద్వారా తడి, పొడి, ప్రమాదకర చెత్తలను వేరువేరుగా సేకరిస్తున్నట్లు తెలిపారు. పట్టణ వాసులు కూడా సహకరించి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బంది వచ్చినప్పుడు అందజేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల నివారణకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీటితో పాటు ప్రతి వార్డులోని డ్రైనేజీలలో పూడికతీత పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పచ్చదనం పరిశుభ్రతకు ఎఫ్ఎస్‌టీ ప్లాంటు ఏర్పాటు హర్షణీయం

ప్రభుత్వ విప్ ఉదయభాను



ఎఫ్ఎస్‌టీ ప్లాంటు శంకుస్థాపనలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఉదయభాను, చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేటఅర్బన్: పచ్చదనం, పరిశుభ్రతకు రాష్ట్ర ప్రభుత్వం ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయడం సంతోషదాయకమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం పట్టణంలోని ముక్త్యాల రోడ్డులో పాలేటి ఒడ్డున ఉన్న డంపింగ్ యార్డులో రూ.1.49 కోట్లతో ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే ఉదయభాను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ వ్యర్థాలతో ఎరువు తయారుచేయడానికి ఈ ప్లాంట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ ఎరువు పంట పొలాలకు ఎంతో ఉపయోగకరమని, నీటిని మొక్కల పెంపకానికి, కూరగాయల సాగుకు ఉపయోగించుకోవచ్చునని అన్నారు. ఈ ప్లాంట్ ఏర్పాటు వలన పరిసర ప్రాంతాల వాసులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని, కొంతమంది కావాలనే దుష్ప్రచారాలు సృష్టిస్తున్నారని తెలిపారు. అలాంటి వారి మాటలు నమ్మవద్దన్నారు. ఇటువంటి ప్లాంట్లు బాపట్ల, మార్కాపురం పట్టణాల్లో ఏర్పాటుచేశారని, అవసరమైతే తానే ఒక బస్సును ఏర్పాటుచేస్తానని అక్కడికి వెళ్లి పరిశీలించుకోవచ్చునని చెప్పారు. విలియంపేటలో ఉన్న శ్మశానవాటికకు తానే గతంలో ప్రహరీ ఏర్పాటుచేశానని తెలిపారు. ఇదే శ్మశానవాటికకు స్థలాన్ని పెంచి మరింత అభివృద్ధి చేసి చుట్టూ ప్రహరీ ఏర్పాటుచేయిస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, జీటెక్ డెవలపర్స్ సత్యనారాయణ, కౌన్సిలర్లు సాధుపాటి రాజు, పందుల రోశయ్య, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు, స్థానిక నాయకులు ఉప్పెల్లి పెంటయ్య, చెరుకుమల్లి రాంబాబు, మారేపల్లి నాగేంద్రం, మల్లెల సాయి, కృపారావు, ఉప్పెల్లి ప్రసాద్, మంగళపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ చికిత్స



భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ వినయకుమారి, పక్కన ఎంఈఓ బాలాజీ

కంచికచర్ల: ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ప్రతిరోజు ఫిజియోథెరపీ, వ్యాయామం చేయించాలని మండల విద్యాశాఖ అధికారి బి.బాలాజీ అన్నారు. స్థానిక భవిత సెంటర్‌లో సోమవారం ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలకు డాక్టర్ వినయకుమారి ఫిజియోథెరపీ చేశారు. దివ్యాంగ పిల్లలను ప్రతిరోజు భవిత సెంటర్‌కు పంపించాలని, వారికి ప్రభుత్వం ఉపకార వేతనాలు మంజూరు చేస్తుందని, వారి వెంట వచ్చిన వారికి అలవెన్స్ కూడా ఇస్తుందని ఎంఈఓ బాలాజీ తెలిపారు. ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన పరికరాలు, ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు బస్‌పాసులు ఇస్తుందని డాక్టర్ వినయకుమారి చెప్పారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిస్సిగ్గుగా అబద్ధాలాడిన సౌమ్య

విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, మహిళా నాయకులు

జుజ్జూరు(వీరులపాడు): నిస్సిగ్గుగా అబద్ధాలాడటం మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నైజం అనే విషయం దాచవరం ఉప ఎన్నిక ఫలితం అనంతరం ఆమె నిర్వహించిన విలేకరుల సమావేశం తేటతెల్లం చేసిందని ఎంపీపీ కోటేరు లక్ష్మి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం అన్నారు. జుజ్జూరు గ్రామంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళా నాయకులతో కలిసి సోమవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాచవరం ఉప ఎన్నిక నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి ఫలితం వచ్చిన తరువాత కూడా శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు గ్రామంలో అడుగు కూడా పెట్టలేదన్న విషయం ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. కానీ సౌమ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే గ్రామంలో ప్రచారం చేసి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారంటూ పచ్చి అబద్ధాలు వల్లించారన్నారు. దాచవరం ఉప ఎన్నిక ఫలితంతో తంగిరాల సౌమ్య మానసిక స్థితి దెబ్బతిందని, ఆమె మంచి మానసిక వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. నందిగామ పట్టణ సుందరీకరణలో భాగంగా విగ్రహాల తొలగింపు విషయంలో సైతం ఇది మహా నగరమా.. రోడ్ల విస్తరణ అవసరమా అని మాట్లాడి ప్రజలను తీవ్రంగా అవమానించారన్నారు. ఇటువంటి వారికి మరొకసారి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో సర్పంచ్‌లు రమావత్ కోటి, మారపాక మహాలక్ష్మి, బందెల రాణి తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



బాలికల హైస్కూల్‌లో నాడు నేడు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో నాడు–నేడు ఫేజ్–2 లో భాగంగా రూ.60 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న 5 అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. తరగతి గదులతో పాటు చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రాధాన్యతా క్రమాన్ని బట్టి రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. స్థానిక 23 వ వార్డు మంగలిబజారులో రూ.13 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఇప్పటివరకు ఈ వార్డులో రూ.25 లక్షలతో సీసీ రోడ్లు, కల్వర్టులు ఏర్పాటుచేశామని, భవిష్యత్‌లో మరింతగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిలర్ దువ్వల రమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు ఫిరోజ్‌ఖాన్, కాశి కిషోర్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

వీరులపాడు: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ మహాలక్ష్మణుడు తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు వీరులపాడు గ్రామానికి చెందిన గుడిశ ప్రకాశరావు (58) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం గ్రామ శివారులో పురుగుమందు తాగి నిస్సహాయ స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు హుటాహుటిన 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు. ప్రకాశరావు మూడెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడని, సాగులో నష్టం రావటంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని భార్య కోటమ్మ తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మందుల దుకాణాలపై విజిలెన్స్ తనిఖీలు

జగ్గయ్యపేట: పట్టణంలోని పలు మందుల దుకాణాలపై డ్రగ్ కంట్రోల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏడీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దుకాణాలలో రికార్డులను పరిశీలించారు. ధరల వివరాలను వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. నాలుగు దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నట్లు గుర్తించామన్నారు.దాడుల్లో జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికా విద్యకు ప్రభుత్వం కృషి



విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కమిటీ సభ్యులు

చందర్లపాడు(నందిగామ టౌన్): బాలికల విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తోందని, విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు కురగంటి రాంబాబు, బట్టుపర్తి రాజు అన్నారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలోని బాలికల గురుకుల పాఠశాలను సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి వారు మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రేమావతి, వార్డెన్ శివమాధవి తదితరులు పాల్గొన్నారు.

23న గృహసారథుల సమావేశం

తిరువూరు:ఈ నెల 23వ తేదీ సాయంత్రం 4 గంటలకు మండలంలోని లక్ష్మీపురం మనోగార్డెన్స్‌లో తిరువూరు నియోజకవర్గంలోని 75 సచివాలయాల పరిధిలో ఉన్న గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి రాష్ట్ర సచివాలయాల కన్వీనర్ కె.రవీంద్రరెడ్డి విచ్చేస్తున్నట్లు తెలియజేశారు.